సాక్షి
నారాయణపేట
సోమవారం ၊ 7 ၊ జూలై ၊ 2025



ప్రాజెక్టులకు జలసిరి

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం స్వల్పంగా తగ్గింది.

వివరాలు 8లో ▸



తగ్గిన భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: ఏకాదశి, మొహర్రంతో నాయినోనిపల్లి మైసమ్మ జాతరలో ఆదివారం భక్తుల రద్దీ తగ్గింది.

గరిష్ఠం/కనిష్ఠం
35.7/23.6

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం



కోస్గి రూరల్: కోస్గి మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద చౌరస్తా నుంచి మున్సిపాలిటీ పరిదిలోని మాసాయిపల్లి గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, సైడ్‌లైట్స్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా రూ.350 కోట్లు మంజూరు చేశారని, వాటితో మినీ ట్యాంక్‌బండ్‌లు, ఆహ్వాన తోరణాలు, అండర్ డ్రైయినేజీ, పలు చౌరస్తాల్లో సుందరీకరణ పనులు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, నాయకులు రాములు, శ్రీనివాస్, కృష్ణమూర్తి, అన్న కిష్టప్ప, శ్రీనివాస్, బాలేష్ తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నాగర్‌కర్నూల్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసం నుంచి ఉదయం 8గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి.. 10:30 గంటలకు మన్ననూర్ మృగవాణి అతిథిగృహానికి చేరుకొని స్థానిక రెవెన్యూ అంశాలపై అధికారులతో చర్చిస్తారన్నారు. అనంతరం అమ్రాబాద్ బీటీరోడ్డు నిర్మాణానికి, గిరిజన భవనం ప్రహరీ నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం ఆదివాసీ చెంచులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తారన్నారు. మంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్, ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం నుంచి జరిగే హెచ్‌సీఏ బి-డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఎండీసీఏ ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఆదివారం జిల్లాకేంద్రం పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని క్రికెట్ మైదానంలో ప్రకటించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మనోహర్‌రెడ్డి అభినందించి మాట్లాడారు. ఇటీవల జరిగిన ఇంట్రా డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటడం అభినందనీయమన్నారు. టుడే లీగ్‌లో మెరుగైన నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ వేసవిలో నిర్వహించిన ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లలో గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. మొదటిసారిగా ఉమ్మడి జిల్లాలో ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ నిర్వహించిన హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీ-డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ గ్రూప్-బీలో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టు తొలి లీగ్ మ్యాచ్‌ను సోమవారం రాకేష్ లెవన్ జట్టుతో ఆడనుందన్నారు. టుడే లీగ్‌లో పది మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉమ్మడి జిల్లా జట్టుకు దక్కుతుందని, ఈ మ్యాచుల్లో క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఎండీసీఏ మైదానంలో రెండు లేదా టుడే లీగ్ మ్యాచ్‌లు, బీసీసీఐ మ్యాచ్ జరిగేలా హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, సభ్యుడు కృష్ణమూర్తి, కోచ్‌లు అబ్దుల్లా, ముఖ్తార్ పాల్గొన్నారు.

ఎండీసీఏ ఉమ్మడి జిల్లా జట్టు

శ్రీకాంత్- కెప్టెన్ (షాద్‌నగర్), అబ్దుల్ రాఫె బిన్ అబ్దుల్లా (మహబూబ్‌నగర్), మహ్మద్ షాదాబ్ అహ్మద్- వైస్ కెప్టెన్ (మహబూబ్‌నగర్), ఎండీ ముఖితుద్దీన్ (మహబూబ్‌నగర్), జయసింహ (పెబ్బేర్), శ్రీకాంత్ (మహబూబ్‌నగర్), అక్షయ్ (నారాయణపేట), సంజయ్ (మహబూబ్‌నగర్), ఛత్రపతి (గద్వాల), రాంచరణ్, గగన్ (నాగర్‌కర్నూల్), శశాంక్ (మహబూబ్‌నగర్), జశ్వంత్ (నాగర్‌కర్నూల్) ఉన్నారు.

కట్టడే లక్ష్యం!

క్షయ రహిత సమాజానికి 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'

- గ్రామాల్లో కొనసాగుతున్న 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక
- ఇంటి వద్దే రోగ నిర్ధారణ పరీక్షలు
- గుర్తించిన రోగులకు ఉచితంగా మందులు



కోస్గి: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించి 2030 సంవత్సరం నాటికి క్షయ రహిత సమాజమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా క్షయ కట్టడికి 'ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్' పేరుతో వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని వైద్యారోగ్య శాఖ అమలు చేస్తుంది. జిల్లాలో గత నెల 2న ప్రారంభమైన కార్యక్రమం వంద రోజులపాటు కొనసాగనుంది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అనుమానిత వ్యక్తులతోపాటు ఇంటింటికి తిరిగి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగికి సమీపంలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా మందులు పంపిణీ చేసి, ఆశ కార్యకర్తల ద్వారా ఇంటి వద్దకే మందులు పంపించి సక్రమంగా వినియోగించేలా పర్యవేక్షిస్తూ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు బాధితులను గుర్తిస్తూ వైద్య సిబ్బంది సహాయంతో సక్రమంగా మందులు పంపిణీ చేస్తూ క్షయ వ్యాధి కట్టడికి అధికారులు కృషిచేస్తున్నారు. ఒకవైపు క్షయవ్యాధి నివారణకు చర్యలు చేపడుతూ మరోవైపు క్షేత్రస్థాయిలో వ్యాధిని గుర్తిస్తూ చికిత్స విధానాలపై అవగాహన కల్పిస్తూ కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. టీబీ వ్యాధి సోకినవారు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా 6 నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడాలని, ఇతరులకు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

క్రమం తప్పకుండా మందుల పంపిణీ

జిల్లాలో వైద్యారోగ్య శాఖ అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం 499 మంది క్షయ రోగులు ఉన్నారు. ప్రతినెల క్రమం తప్పకుండా వీరందరికి మందులు పంపిణీ చేస్తున్నారు. రోగులు సరైన పౌష్టికాహారం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నెలకు రూ.500 చెల్లించేది. ప్రస్తుతం దీన్ని రూ.1000కి పెంచి రోగుల ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నారు. చికిత్స కొనసాగినంత కాలం ఈ ఆర్థిక సాయాన్ని రోగుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

100 రోజుల ప్రణాళిక అమలు ఇలా..

వైద్య సిబ్బంది జిల్లాలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఉన్న డయాబెటిస్, క్యాన్సర్, హెచ్ఐవీ, టీబీ రోగులతోపాటు రోగ లక్షణాలు ఉన్న వారికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఈమేరకు తెమడ పరీక్షలను సీబీనాట్, ట్రూనాట్, ఎక్స్‌రే పద్ధతుల్లో పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారి వివరాలు నమోదు చేసుకొని ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. ఏదైన ఇంట్లో క్షయ రోగి ఉంటే మిగిలిన కుటుంబ సభ్యుల శరీరాల్లోనూ బ్యాక్టీరియా కలిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వారిలో రోగనిరోధక శక్తి తగ్గిన తర్వాత వ్యాధి లక్షణాలు బయటపడతాయి. ఇలాంటి సందర్భాల్లో కుటుంబ సభ్యులకు సీవై-టీబీ అనే టీకా ఇస్తారు. ఒక వేళ వారి శరీరంలో బ్యాక్టీరియా ఉంటే 48 గంటల్లో టీబీ పాజిటీవ్ వస్తుంది. వారికి ఐఎస్‌హెచ్ మాత్రలిచ్చి 6 నెలల పాటు వాడాలని సూచిస్తారు. ఈ మందుల వినియోగం తర్వాత వీరికి క్షయ వ్యాధి సోకదు.

సమష్టి కృషితోనే వ్యాధి నివారణ



టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తుంది. జిల్లాలో నారాయణపేట, మక్తల్, కోస్గిని మూడు విభాగాలుగా చేసి గ్రామాల వారీగా టీబీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు సైతం టీబీ లక్షణం కనిపించిన వెంటనే రోగిని ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలి. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, వ్యాధిగ్రస్తులు, వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు సమష్టిగా టీబీ నియంత్రణకు కృషిచేయాలి. – డాక్టర్ సత్య ప్రకాష్‌రెడ్డి, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి



నర్వ మండలంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు

100 రోజులపాటు అమలు చేస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమ అమల్లో భాగంగా గ్రామాల్లో టీబీ ముక్త్ భారత్ అబియాన్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ వైద్య శిబిరాలలో డయాబెటీస్, డయాలసిస్, 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, బీపీ, షుగర్, పాత టీబీ వ్యాధిగ్రస్తులు, ప్రస్తుతం లక్షణాలు కనిపించే వ్యక్తులు, హెచ్ఐవీ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులను అందిస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల పరిధిలో ఉన్న 280 గ్రామ పంచాయతీలను మూడు విభాగాలుగా విభజించి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. నారాయణపేట, మక్తల్, కోస్గి యూనిట్లుగా ఏర్పాటు చేసి పీహెచ్‌సీల వారిగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. టీబీ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉన్న వారిని 'వల్నరబుల్ పాపులేషన్'(అపాయానికి గురయ్యే అవకాశం ఉన్న జనాభా)గా ముందుగానే గుర్తించి గ్రామాల వారిగా వివరాలు నమోదు చేశారు. జిల్లాలో మొత్తం ఒక లక్ష 30 వేల మంది ఉన్నట్లు ముందుగానే గుర్తించి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయడానికి లక్ష్యంగా నిర్ధారించినట్లు జిల్లా టీబీ నియంత్రణ అధికారులు చెబుతున్నారు.



ఖిల్లా కోటలో బీబీ ఫాతిమా పీరు ఊరేగింపులో వేలాదిగా పాల్గొన్న భక్తులు

ఖిల్లా కోట.. కిటకిట

ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కోయిలకొండ పీర్ల పండుగకు భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు ఖిల్లా కోటపై కొలువుదీరిన బీబీ ఫాతిమాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గండెల్ సాహెబ్, బీబీ ఫాతిమా, ఉస్సేన్ పచ్చ, ఖాసీం సాహేబ్ పీర్ల కలయిక అందరినీ ఆకట్టుకుంది. – కోయిల్‌కొండ



ఖిల్లా కోటలో అలాయ్ దూకుతున్న భక్తుడు

- వివరాలు 8, 9లో..

గిరిజన గ్రామాలకు మహర్దశ

- 'పీఎం జుగా'లో మౌలిక సదుపాయాల కల్పన
- ఆరోగ్య సంరక్షణకు మొదటి ప్రాధాన్యం
- విద్య, జీవనోపాధిలో కీలకమైన మార్పులు
- తొలివిడతలో జిల్లాలోని 34 గిరిజన గ్రామాల ఎంపిక
- 19 ప్రభుత్వ శాఖల ద్వారా అభివృద్ధికి చర్యలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ ఆమ్ అభియాన్ (పీఎం జుగా) మిషన్ ద్వారా సామాజిక, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 8.6 శాతం షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) ఉంది. ఇతరులతో పోలిస్తే వీరికి విద్య, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు నేటికీ అందని ద్రాక్షగా మిగిలాయని అనేక సర్వేలు, నివేదికలు తేల్చాయి. అందువల్లే సామాజిక, ఆర్థిక అంతరాలు ఉత్పన్నమవుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పీఎం జుగా మిషన్ ప్రవేశపెట్టింది. ఈ మిషన్ ద్వారా వెనకబడిన గిరిజన గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

విద్య, మౌలిక సదుపాయాలు

ప్రధానంగా గిరిజన గ్రామాల్లో నివాసాలు లేని వారికి ఇళ్లు, రహదారులు, ప్రతి ఇంటికి నల్లా నీళ్లు, ఎల్‌పీజీ గ్యాస్ అందేలా చర్యలు తీసుకుంటారు. సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు వైద్య సదుపాయాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, పోషణ్ వాటికాస్, ఆయుష్మాన్ కార్డులు అందజేస్తారు. విద్య, నైపుణ్యాలకు దూరంగా ఉంటున్న గిరిజన గ్రామాల్లో విద్యార్థులకు ప్రత్యేక ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ ఏర్పాటు చేస్తారు. అలాగే విద్యుత్ సౌకర్యాలకు నోచుకోని గ్రామాలకు విద్యుత్ అందేలా చర్యలు తీసుకుంటారు. ప్రత్యేకంగా ఆన్ గ్రిడ్ పవర్ కనెక్షన్లు, ఆఫ్ గ్రిడ్ సోలార్ కనెక్షన్లు అందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులు, పాఠశాలలపై రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు జరగనున్నాయి. గిరిజనులు పండించే పంటలను మార్కెట్‌కు తరలించి, వారికి గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటారు. కమ్యూనికేషన్ మెరుగుపర్చేందుకు 4జీ నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి తెస్తారు.



హన్వాడ మండలంలోని ఓ తండావాసులతో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

ఐదేళ్ల ప్రణాళిక..

జిల్లాలో పీఎం జుగా మిషన్ ద్వారా ఐదేళ్లలో వెనకబడిన ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 34 గ్రామాల్లో 19 ప్రభుత్వ శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు చేపడతారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో శిబిరాల్లో పాల్గొనే అధికారులు అక్కడ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి గల కారణాలు, అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, సంరక్షణ వంటివి పరిశీలించి వాటిని నమోదు చేసి ఆయా శాఖల అధిపతుల ద్వారా అక్కడి పనులకు అయ్యే ఖర్చు ఎంత.. అనే అంచనాలు రూపొందిస్తారు. అనంతరం జిల్లా గిరిజనాభివృద్ధి అధికారికి పంపుతారు. వాటన్నింటినీ కలెక్టర్ ద్వారా పీఎం జుగా మిషన్ అధికారులకు అందజేసిన అనంతరం వెను వెంటనే వాటికి అయ్యే నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతారు. ఈ పనులన్నీ 2029 నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఇవీ మిషన్ లక్ష్యాలు..

జిల్లాలో గిరిజన జనాభా 500 మంది అంతకంటే ఎక్కువ లేదా కనీసం 50 శాతం అంత కంటే ఎక్కువ గిరిజన నివాసితులు ఉన్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు సామాజిక, ఆర్థిక పరిస్థితులు, విద్య, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాలను మెరుగుపర్చి గిరిజనుల పురోగతికి తోడ్పాటునందించడం పీఎం జుగా మిషన్ ప్రధాన ఉద్దేశం.

గిరిజన గ్రామాలు ఇవే..

పీఎం జుగా లో మొదటి విడతలో 34 గిరిజన గ్రామాలను ఎంపిక చేశారు. అందులో తిమ్మాయిపల్లె, నీరెల్లపల్లె, జల్లిగడ్డతండా, ఊటకుంటతండా, వైకుంఠతండా, అప్పాజిపల్లే, మోదంపల్లి, తిరుమల్‌గిరి, అయోధ్యనగర్, అమ్మూర్, చిన్న ఆదిర్యాల్, కొల్లోనిమోర్లతండా, తువ్వగడ్డతండా, మల్లెబోయినిపల్లి, కొత్తతండా, పోచమ్మగడ్డతండా, చిట్టెబోయిన్‌పల్లి, ఎనిమిదితండా, అమ్రియానాయక్‌తండా, బండమీదితండా, కజుర్లగుట్టతండా, చింతల్‌తండా, అయ్యవారిపల్లి, అయ్యవారిపల్లితండా, కేశవాపూర్, వెంకటాపూర్, జైనల్లీపూర్, సింగందొడ్డి, కాకర్‌జాల, రేకునల, చౌడాపూర్, హాజిలాపూర్, రాఘవపూర్, కుత్నెపల్లి గ్రామాలున్నాయి.

గ్రామాన్ని ఎడారిగా మారిస్తే ఊరుకోం..



మాగనూర్‌లో ఇసుక తరలించవద్దని తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

మాగనూర్: మాగనూర్ గ్రామానికి ప్రధానంగా సాగు, తాగునీరు అందిస్తున్న పెద్ద వాగులో ఇసుక తరలిస్తే గ్రామం ఎడారిగా మారుతుందని, వారం రోజులుగా ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఈమేరకు గ్రామస్తులంతా సమావేశమై ఇసుక తరలింపునకు వ్యతిరేకంగా తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మాగనూర్ వంతెన దగ్గర ఇసుక తరలించవద్దని కోరినా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇందులో భాగంగా శనివారం మళ్లీ అధికారులు ఇసుక తరలించేందుకు ప్రయత్నం చేయడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిందని , ప్రతి రోజు ఇదే విధంగా ఇసుక రవాణాను అడ్డుకోవడం అంటే ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. ఇకనైనా అధికారులు మరో చోట ఇసుక తరలించేలా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో వందలాది ఎకరాలు బీడు భూములుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రయత్నం విరమించుకోవాలని లేదంటే ఉద్యమాలకైన సిద్ధంగా గ్రామస్తులు ఏకతాటిపై ఉంటారని తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో 22.6 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం ఆదివారం సాయంత్రం వరకు 22.6 అడుగులకు చేరింది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా జూరాల నుంచి ఒక పంపును రన్ చేసి నీటిని విడుదల కొనసాగిస్తున్నారు. గత నెల రోజులుగా ప్రాజెక్టులోకి వస్తున్న నీటితో రోజుకు కొంత మేర నీటిమట్టం పెరుగుతోంది. జూరాల నుంచి నీరు రాక ముందు 11 అడుగులు ఉండగా.. 11.6 అడుగులు పెరిగి 22.6 అడుగులకు చేరింది. అయితే పాత అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా.. మరో 4 అడుగుల నీరు రావాల్సి ఉంది. ఇక ప్రాజెక్టు పూర్తిస్థాయి గేట్ల లెవల్ వరకు 32.6 అడుగులు ఉండగా మరో 10 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు పూర్తిగా నిండుతుంది.

కొనసాగిన కేంద్ర బృందం పర్యటన

వనపర్తి రూరల్: పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో ఆదివారం కేంద్ర బృందం 28వ కమిటీ నీతి ఆయోగ్ ఉప కార్యదర్శి అర్విందకుమార్, సెంట్రల్ వాటర్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు శాస్త్రవేత్త యాదయ్య పర్యటించారు. కంచిరావుపల్లి, తాటిపాముల, కంభాళాపురం శివారులోని భీమా 15వ ప్యాకేజీలోని ప్రధాన, మైనర్ కాల్వలు, కంభాళాపురం తండా 27 ప్యాకేజీలోని 18/19 కాల్వ 7ఆర్ మైనర్ కాల్వను, శ్రీరంగాపురం రంగసముద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి సాగునీటి సరఫరా ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కాల్వల్లో జమ్ము, పూడిక పేరుకుపోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదని రైతులు వివరించారు. ఫీడర్ ఛానల్, డిస్ట్రిబ్యూష్యన్ షట్టర్లు, కాల్వల వెడల్పు పెంచడం, లైనింగ్ సరిగా లేదని జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకట్రామారెడ్డి రైతులతో కలిసి కేంద్ర బృందానికి సమస్యల వినతిపత్రం అందజేశారు. వారి వెంట ఇరిగేషన్ సీఈ సత్యనారాయణరెడ్డి, ఎస్‌సీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ కేశవరావు, డీఈ కిరణ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఏఈలు, ఇతర అధికారులు ఉన్నారు.

యథేచ్ఛగా దోచేస్తున్నారు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో ఇసుక అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అధికారుల పర్యవేక్షణ కరువు



కోయిల్‌సాగర్ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ధన్వాడ: మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో కొందరు అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా దోచేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో ఇదే అదునుగా కొంతమంది ఇసుక అక్రమ రవాణకు తెరలేపారు. ముఖ్యంగా మండలంలోని గోటూర్ గ్రామ పక్కన ఉన్న కోయిల్‌సాగర్ వాగు నుంచి వారం రోజులుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గోటూర్ గ్రామంలో 35 మందికి మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అయ్యాయి. ఈ క్రమంలో ధన్వాడ మండలానికి ఉచితంగా ఇసుక అందించేందుకు ప్రభుత్వం ఉట్కూర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి వద్ద ఉన్న ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చింది. కానీ అది గ్రామానికి దూరం అవుతుందని పక్కనే కోయిల్‌సాగర్ వాగు నుంచి ఇసుకను తరలించడానికి అనుమతి ఇవ్వాలని లబ్ధిదారులు, గ్రామస్తులు అధికారులను కోరారు. దీంతో తహసీల్దార్ సింధుజా, ఎంపీడీఓ సాయి ప్రకాష్ రోజుకు 4 నుంచి 5 ట్రిప్పులు ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చారు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు ఇక రెచ్చిపోతున్నారు. ఇసుకను ఇళ్లకు తరలిస్తున్నట్లు చెబుతూ మండలంలోని కిష్టాపూర్, రాంకిష్టాయిపల్లి గ్రామాలతో పాటు మరిన్ని గ్రామాలలో ప్రైవేట్ వ్యక్తులకు ట్రాక్టర్ ఇసుక రూ.5 వేల నుంచి రూ.6వేల వరకు విక్రయిస్తున్నారు. ఇలా దాదాపు 16 ట్రాక్టర్లు ఏర్పాటు చేసి జేసీబీలతో ఇసుకను తవ్వి రోజు 100 ట్రిప్పుల వరకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయనికి భారీగా గండిపడుతుంది. అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా మామూళ్ల మత్తులో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



కోయిల్‌సాగర్ వాగు నుంచి రోజుకు 5-6 ట్రాక్టర్లు ఇసుకను తరలించడానికే అనుమతి ఇచ్చాం. అది ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలలోపు మాత్రమే ఇసుకను తరలించాలని సూచించాం. అయితే కొందరు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఇకపై ఇసుక రవాణాను పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించాం. ఎవరైనా అనుమతి లేకుండా ఇతర గ్రామాలకు ఇసుక తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

–సింధుజా, తహసీల్దార్, ధన్వాడ

నమో.. వేంకటేశా



మన్యంకొండలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

వైభవంగా తొలి ఏకాదశి

- జనసంద్రమైన ఆలయాలు
- మన్యంకొండలో శోభాయమానంగా శేషవాహన సేవ
- స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం జనసంద్రమైంది. ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు మన్యంకొండకు తరలివచ్చారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అలంకారోత్సవం, అనంతరం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారి శేషవాహన సేవ కనులపండువగా నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన శేష వాహనంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న సభా మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మేళతాళాలు, పురోహితుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల హరినామస్మరణ మధ్య ఊరేగింపు ముందుకు కదిలింది. స్వామివారి సేవను చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం స్వామివారిని తిరిగి శేష వాహనంలో హనుమద్దాసుల మండపం వద్దకు తీసుకెళ్లి అక్కడ వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 నుంచి స్వామివారి దర్శనం ప్రారంభమైంది. గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న కోనేరు వరకు భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే దేవస్థానం పక్కనున్న శివాలయంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానంతో పాటు స్టేజీ సమీపంలోని అలివేలు మంగతాయారు ఆలయంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా స్వామివారి గర్భాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామికి లక్ష పుష్పార్చన..

చిన్నచింతకుంట: తొలి ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయంలో ఆదివారం లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం చేశారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేతుడైన కురుమూర్తిస్వామి ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలు ధరింపజేసి ప్రధాన ఆలయంలో వివిధ రకాల పూలతో అలంకరించిన మండపంలో విగ్రహాలను ఉంచారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ లక్ష పుష్పార్చన కార్యక్రమం కనుల పండుగగా సాగింది. వివిధ ప్రాంతాల తరలి వచ్చిన దంపతులు కార్యక్రమంలో పాల్గొని పుష్పార్చన చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా కనిపించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు వెంకటయ్య, విజయ, ఆలయ కమిటీ సభ్యుడు భారతమ్మ, కమలాకర్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

అలంపూర్ ఆలయాల్లో..



అలంపూర్ జోగుళాంబ ఆలయంలో బారులుదీరిన భక్తులు

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజుతో పాటు తొలి ఏకాదశి కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. జోగుళాంబ ఆలయంలో కుంకుమార్చన, అభిషేక పూజలు అనంతరం బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఈఓ పురేందర్ కుమార్, సిబ్బంది భక్తులకు తాగునీటి వసతితో పాటు అన్నదాన సత్రంలో అన్నప్రసాదం అందించే ఏర్పాట్లు చేశారు. వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు చేపట్టారు.



జోగుళాంబ అమ్మవారు

ఖిల్లా కోట.. కిటకిట

- కోయిల్‌కొండలో అంబరాన్నంటిన మొహర్రం
- కనులపండువగా బీబీ ఫాతిమా సవారీ
- అగ్నిగుండంలో నడిచి మొక్కులు తీర్చుకున్న భక్తజనం



కోయిల్‌కొండలో పారుపల్లి పీర్ల సవారీ

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ఆదివారం మొహర్రం వేడుకలు అంబరాన్నంటాయి. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు ఖిల్లా కోటపై కొలువుదీరిన బీబీ ఫాతిమాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున తహసీల్దార్ కార్యాలయం నుంచి భాజాభజంత్రీలు, కాగడాలతో అధికారులు, గ్రామ పెద్దలు, భక్తజనం ఖిల్లా కోటపైకి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు ఆఖరి ఘట్టంగా బీబీ ఫాతిమాకు గంధం పూసి ఆశన్న, ఊశన్న పీర్లను కోటపై భాగం నుంచి గ్రామం వరకు ఊరేగించారు. అదే విధంగా అగ్నిగుండం మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అగ్నిగుండంలో నడిచి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, కోయిల్‌కొండలో గండెల్ సాహెబ్, బీబీ ఫాతిమా, ఉస్సేన్ పచ్చ, ఖాసీం సాహెబ్ పీర్ల కలయిక అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం 3గంటలకు కోటపై భాగం నుంచి మొహర్రం కీలక ఘట్టమైన పీర్ల ఊరేగింపు ప్రారంభించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన పీర్లు సైతం బీబీ ఫాతిమాను అనుకరించాయి. ప్రధాన వీధుల గుండా బీబీ ఫాతిమా వెళ్తుంటే.. మహిళలు బొడ్డెమ్మలు వేస్తూ అలాయ్ బలాయ్ పాటలు పాడారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ తిరుపాజీ నేతృత్వంలో 50 మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

హసేనుస్సేన్ దోస్తరాద్దీన్

ఊట్కూర్: ఉమ్మడి జిల్లాలోనే అత్యంత వైభవంగా జరిగే మొహర్రం వేడుకలు ఊట్కూర్‌లో శాంతియుతంగా ముగిశాయి. స్థానిక పెద్దపీర్ల మసీదులో పది రోజుల క్రితం ప్రతిష్ఠించిన హసేన్ – హుస్సేన్ పీర్లకు నవమి సవారీ సందర్భంగా తెల్లవారుజామున గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు దశమి సవారీ ప్రారంభం కాగా.. గ్రామ పురవీధుల్లో కనులపండువగా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రధాన కూడళ్లలో మహిళలు బొడ్డెమ్మ ఆడారు. యువకులు డప్పులు కొడుతూ అలాయ్ ఆడారు. ముందుగా పెద్ద పీర్ల మసీదులో హసేన్ – హుస్సేన్ పీర్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో భాగంగా దేవినగర్‌లో నిర్వహించిన డోలారోహణ కార్యక్రమం ఆకట్టుకుంది. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఊయ్యాలలో ఆరెకటిక కులానికి చెందిన మగశిశువును వేయగా.. హసేన్-హుసేన్ పీర్లు ఊయ్యాలను ఊపి బాలుడికి నామకరణం చేశాయి. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొనిమొక్కులు తీర్చుకున్నారు. డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



ఊట్కూర్‌లో డోలారోహణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

ట్రాక్టర్‌టైరుకు తగిలి బాలుడి మృతి

అచ్చంపేట రూరల్: ఇంటి ముందు గడ్డిని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు బాలుడు ట్రాక్టర్ టైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని శివారుతండాలో చోటుచేసుకుంది. సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి కథనం ప్రకారం.. తండాకు చెందిన హన్మంత్ ఆదివారం తన ఇంటిముందర ట్రాక్టర్‌తో గడ్డిని తొలగిస్తుండగా వెనక టైర్‌కు అతని కుమారుడు జశ్వంత్(4) ప్రమాదవశాత్తు వచ్చి తగిలాడు. బాలుడి తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి తల్లి తేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. హన్మంతు దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా.. చిన్న కుమారుడు మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.

రైలునుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

నవాబ్‌పేట/ ఉండవెల్లి: రైలునుంచి జారిపడి మండలానికి చెందిన వ్యక్తి గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. మండలంలోని కారుకొండకు చెందిన నరేందర్ జిల్లాకేంద్రం నుంచి తిరుపతికి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్తున్నాడు. కాగా ఉండవెల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు డోరు వద్ద ఉండగా.. జారిపడి గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని వెంట ఉన్న వారు కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

గుప్తనిధుల కోసం పొలాల్లో తవ్వకాలు

కోడేరు: గుప్తనిధుల కోసం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రైతుల పొలాల్లో తవ్వకాలు చేపట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని ఎత్తంగట్టు సమీపంలో బాలస్వామి పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారని అక్కడ కుంకుమ, పసుపు, అగరుబత్తులు, నిమ్మకాయలు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎస్‌ఐ జగదీశ్వర్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.



నీరు కలుషితమై చేపలు మృతి



లింగంపల్లిలో మృతి చెందిన చేపలు

నవాబ్‌పేట: మండలంలోని లింగంపల్లిలో రైతు తన పొలంలో పెంచిన రూ.5లక్షల విలువగల చేపలు మృత్యువాత పడ్డాయి. ఆదివారం పెంపుడుకుంటలో నీరు కలుషితం కావడంతో ప్రత్యేక కుంటలో ఏర్పాటు చేసిన చేపలన్నీ ఒకేసారి మృతి చెందాయి. ఈ ఘటనతో రవీందర్‌రెడ్డికి దాదాపు రూ.5లక్షలకు పైగానే నష్టం వాటిల్లింది. దీంతో ఈ విషయంలో చేపల పెంపకం రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే చేపల పెంపకంపై సంబంధిత శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

బుద్దారంవాసికి అమెరికాలో గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన కృష్ణారావు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు అమెరికాలో గోల్డ్‌మెడల్ సాధించి అబ్బురపరిచాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పసుపుల కృష్ణారావు హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అమెరికా అలబామాలో నిర్వహిస్తున్న వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌లో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ స్పోర్ట్స్ విభాగం తరఫున ఇండోర్ రోయింగ్ గేమ్ 50 ప్లస్ విభాగంలో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ గేంలో 80 దేశాల నుంచి 8500మంది పాల్గొనగా.. పసుపుల కృష్ణారావు గోల్డ్‌మెడల్ సాధించాడు. కృష్ణారావు గోల్డ్‌మెడల్ సాధించాడన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు, స్నేహితులు అతడికి ఫోన్‌కాల్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దేశం, రాష్ట్రానికి, సొంతూరుకు మంచిపేరు తీసుకురావాలని కోరారు.

సార్.. నన్ను పట్టించుకోండి



నవాబుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పీహెచ్‌సీ ప్రారంభం నాటి శిలాఫలకం

ఊరు :	నవాబుపేట
ఆస్పత్రి :	ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
పనివేళలు :	24 గంటలు
ఉండాల్సిన వైద్యులు :	ఇద్దరు
ప్రస్తుతం ఉన్నది :	ఒక్కరు
పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలు, తండాలు :	70కిపైనే
జనాభా (సుమారు):	80,000

నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సరిగ్గా 57 ఏళ్ల క్రితం ఇదే రోజు (07.07.1968)న అప్పటి న్యాయ శాఖ మంత్రి నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ కేకే రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. 57 ఏళ్ల క్రితం పురుడు పోసుకున్న నేను గతంలో ఎంతో మందికి మెరుగైన వైద్య చికిత్స అందించి గుర్తింపు తెచ్చుకున్నాను. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సైతం సాధించిన రోజులు ఉన్నాయి. ఫలితంగా రూ.25 లక్షలు వెచ్చించి.. నూతన భవనం నిర్మించి.. 24 గంటలపాటు వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. కానీ, ప్రస్తుతం నా పరిస్థితి ఏమీ బాగోలేదు. పేరుకేమో 24 గంటల ఆస్పత్రి అయినా డాక్టర్లు ఉండేది నాలుగు గంటలే. అది కూడా ఎవరో ఒక్కరు మాత్రమే. వీరి నిర్లక్ష్యం ఫలితంగా గతంలో ఘన చరిత్రను లిఖించిన నేను ఇప్పుడేమో అపకీర్తిని మూటగట్టుకుంటున్నా. ఇది సరిపోదన్నట్లు ఇప్పుడేమో ఒకే డాక్టర్‌ను నియమించారు. ఆయన కూడా మధ్యాహ్నం వరకే వెళ్లిపోతుండటంతో.. నర్సులతో నెట్టుకొస్తున్న పరిస్థితి. పైగా మండలంలోని గ్రామాలు, తండాలు 70కిపైగా ఉండగా.. సుమారు 80 వేల మంది జనాభాకు వైద్య సేవలందించాలి. ఇప్పటికే కు.ని. ఆపరేషన్ల కోసం ప్రజలంతా జిల్లాకేంద్రానికి వెళ్లిపోతున్నారు. కాబట్టి.. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోని పాలకులు.. అధికారులు.. నా పరిస్థితిని అర్థం చేసుకొని నిరుపేద ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలందించేలా 30 పడకల ఆస్పత్రిగా మార్చడంతోపాటు సరిపడా వైద్యులను అందుబాటులో ఉంచుతారని కోరుతున్నాను. **- నవాబుపేట**

ప్రాజెక్టులకు జలసిరి

- జూరాల 12గేట్లు ఎత్తి నీటివిడుదల
- ఎగువ నుంచి 1.13లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- దిగువకు 1.11లక్షల క్యూసెక్కులు
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



జూరాల ప్రాజెక్టు వద్ద 12క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురిసిన వర్షాలతో వస్తున్న ఇన్‌ఫ్లో వరద స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు లక్షా 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో లక్షా 13వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 12 క్రస్టు గేట్లను ఎత్తి 79, 920 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 5 యూనిట్‌లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 29, 296 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 43 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులు, కుడి కాల్వకు 290 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్ -2కు 750 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1, 24,710 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.444 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

సుంకేసులలో 17 గేట్లు ఎత్తి నీటివిడుదల

రాజోళి: సుంకేసుల డ్యాం నుంచి నీటివిడుదల కొనసాగుతుంది. ఆదివారం ఎగువ నుంచి వచ్చిన వరద నీటిని డ్యాం గేట్లు తెరిచి దిగువకు వదులుతున్నారు. ఆదివారం ఎగువ నుంచి 67,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 17గేట్లను తెరిచి 67,218 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

11యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు భారీగా చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి లక్ష్యం వైపుగా పరుగులు పెడుతుంది. ఈ ఏడాది 610 ఎంయూ టార్గెట్ ఉండగా.. ఇదివరకే 205 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించారు. గతేడాది జూలై మూడో వారంలో విద్యుదుత్పత్తి ప్రారంభమైన విషయాన్ని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 92.848 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 111.880 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 204.728 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ప్రస్తుతం 30వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని, వినియోగించిన నీటిని దిగువ శ్రీశైలానికి వదులుతున్నామని తెలిపారు.

నిండుకుండలా శ్రీశైలం ప్రాజెక్టు

దోమలపెంట: ఎగువ ప్రాంతాలు జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. ఆదివారం జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 79,920 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 29,296, సుంకేసుల నుంచి 67,218 మొత్తం 1,76,434 క్యూసెక్కుల నీటి ప్రవాహం దిగువన శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 879.3 అడుగుల నీటిమట్టం వద్ద 184.2774 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 32,425 మొత్తం 67,740 క్యూసెక్కుల నీటిని దిగువన నాగర్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 17.109 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 14.461 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.



దిగువ జూరాలలోని పవర్‌హౌజ్

దొంగస్వామిని తరిమిన గ్రామస్తులు



దొంగస్వామితో గ్రామస్తుల వాగ్వాదం

కల్వకుర్తి రూరల్: గ్రామీణ ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని డబ్బులు దండుకోవాలని ప్రయత్నించిన దొంగస్వామిని గ్రామస్తులు తరిమిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ముకురాలలో చోటుచేసుకుంది. వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దేశగురువుగా పేరు చెప్పుకొంటూ శనివారం రాత్రి ముకురాల గ్రామానికి ఆరుగురు శిష్యులతో కలిసి గుర్రంపై వచ్చి శివాలయంలో బస చేశాడు. ఆదివారం తొలి ఏకాదశి కావడంతో పూజల అనంతరం గ్రామంలో గుర్రంపై తిరుగుతూ ప్రజలకు ఆశీర్వాదం ఇచ్చాడు. ఆయన గుర్రం వెంట ఆరుగురు బటులుగా ఉన్నారు. గుర్రంపై దొంగస్వామి ఓ ఇంటికి రాగానే ఆ ఇంటి మహిళ ఒక బిందెలో పసుపు, కుంకుమ కలిపిన నీటితో గుర్రం ముందు సాఖపెట్టి మొక్కింది. దీంతో వెంటనే దొంగస్వామి ఆశీర్వదించి.. 'నీకు దోషముంది.. కొన్ని శక్తులు నిన్ను పీడిస్తున్నాయి.. నేను వాటిని తొలగిస్తాను' అంటూ నమ్మబలికి ఇంట్లోకి ప్రవేశించాడు. వాళ్లను రకరకాల మాటలతో మోసం చేసి జేబులకు చిల్లుపెట్టే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన గ్రామస్తులు దొంగస్వామితో ఇల్లు ఒల్లు గుల్లయ్యే ప్రమాదం ఉందని గ్రహించి అతనితో వాగ్వాదానికి దిగారు. మోసం చేస్తున్నావని నిలదీసి వెంటనే గ్రామం విడిచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. చాలామంది గ్రామస్తులు రావడంతో వివాదం ముదిరింది. చివరికి గ్రామస్తులు గట్టిగా నిలదీసి వెంటపడి తరమడంతో దొంగస్వామి పలాయనం చిత్తగించక తప్పలేదు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్‌కై జీ+టూ+2బీలర్+రూం+బో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073

సాక్షి
పుట్టిన రోజు
తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్